సాక్షి
తిరుపతి
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



దివ్య తేజం.. భక్తజన పునీతం

తుమ్మలగుంటలో రథసప్తమి వేడుకలు మిన్నంటాయి. సప్తవాహనాలపై కల్యాణ వెంకన్న ఊరేగుతూ కనువిందు చేశారు. - IIలో



సమష్టిగా ఎన్నికల విధులు

సార్వత్రిక ఎన్నికల్లో కలెక్టర్, ఎస్పీలు సమష్టిగా విధులు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. - IIలో



నిబద్ధతతో ఎన్నికల విధులు

ఎన్నికల్లో బెటాలియన్ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని ఏపీఎస్పీ బెటాలియన్-4 డీఐజీ రాజకుమారి సూచించారు. - IIలో

న్యూస్‌రీల్

ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారికి ఉద్యోగాలు



లోకనాథం

- 23న ఇంటర్వ్యూలు

తిరుపతి అర్బన్: ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన యువకులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు సూళ్లూరుపేట – శ్రీకాళహస్తి రోడ్ మార్గంలోని సీసీఎల్ ప్రొడక్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కాంటినెంటల్ కాఫీ పార్క్, కువ్వకోలి వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంపికైన వారికి అదే కంపెనీ ద్వారా రాయితీతో వసతి సదుపాయం ఉంటుందని వివరించారు. రిజిస్ట్రేషన్ లింకును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అదనపు సమాచారం కోసం 9966601867 సంప్రదించాలని కోరారు.

శరవేగంగా భూ సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: భూ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్, జేసీ శుభం భన్సల్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాప్యం లేకుండా ప్రభుత్వ పథకాలకు చెందిన అన్ని అంశాలను వేగవంతం చేయాలని సూచించారు. భూసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దినకర..శుభకర

కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సూర్యజయంతిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారు సప్త వాహనాలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలను చూడలేని భక్తులు ఈ ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలవబడే రథసప్తమి వేడుకల్లో పాల్గొని తరించారు. మలయప్ప దివ్య మంగళరూపాన్ని దర్శించి పునీతులయ్యారు.



సూర్యప్రభ వాహన సేవలో హారతి అందుకుంటున్న భక్తులు

తిరుమలలో ఘనంగా రథసప్తమి వేడుకలు

- సప్త వాహనాలపై శేషాచలాధీశుని వైభవం
- భక్తజనంతో పోటెత్తిన తిరుమల గిరులు
- రద్దీకి అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- నిరంతర పర్యవేక్షణలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు



తిరుపతి(అలిపిరి): సూర్యజయంతిని పురస్కరించుకుని అర్ధ బ్రహ్మోత్సవంగా జరుపుకునే రథసప్తమి వేడుకలను తిరుమలలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సప్త వాహనాలపై శేషాచలాధీశుని వైభవాన్ని లక్షలాది మంది భక్తులు తిలకించి పులకించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమలలోని నాలుగు మాడ వీధుల్లో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు రథసప్తమి వేడుకలు తిరుమలలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సూర్యప్రభ వాహనం

సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం శ్రీవారి పాదాలపై ప్రసరించి అంజలి ఘటించాడు. ఈ అపురూప దృశ్యాన్ని వేలాది మంది భక్తిపారవశ్యంతో తిలకించి పులకించారు. భక్తుల గోవిందనామస్మరణ మధ్య స్వామివారి వాహనసేవ వైభవంగా సాగింది.

సప్తవాహనా.. గోవిందా

రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారు చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పుష్కరిణిలో చక్రస్నానం వేడుకగా నిర్వహించారు. శ్రీవరాహస్వామివారి ఆలయం వద్ద గల స్వామి వారి పుష్కరిణిలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం నిర్వహించారు.


సాంస్కృతిక కళావైభవం

రథసప్తమి వాహనసేవల్లో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 900 మంది కళాకారులు పాల్గొన్నారు. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఎస్పీ మల్లికా గార్గ్ ఇతర అధికారులు వాహన సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



హనుమంత వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి







చక్రస్నానం.. నేత్రపర్వం





సాంస్కృతిక కళా నీరాజనం



చిన్న శేష వాహనం



సర్వభూపాల వాహనం



గరుడ వాహనం



చంద్రప్రభ వాహనం



కల్పవృక్ష వాహనంపై మలయప్ప కనువిందు



చక్రస్నానం ఆచరిస్తున్న అర్చకులు



గోవిందా.. గోకుల నందా...

క్లుప్తంగా

20న జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉప ఉపాధి కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీలో రిటైల్ ట్రైనీ, ఫార్మాసిస్ట్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్లలోపున్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. అలాగే బ్లిస్ సంస్థలో ఎలక్ట్రీషియన్ (అప్రెంటీస్) చేసేందుకు ఐటీఐ ఎలక్ట్రీషియన్ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు.

డేటా సైన్స్‌పై సదస్సు ప్రారంభం



పిషర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీలోని ప్రకాశం భవన్‌లో శుక్రవారం మోడ్రన్ స్టాటిస్టిక్స్ ఫర్ రీసెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ డేటా సైన్స్ టెక్నిక్స్ అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. వర్సిటీ పరిశోధన విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. సాంఖ్యకశాస్త్ర పితామహుడు ప్రొఫెసర్ ఆర్ ఏ పిషర్ 134వ జయింతిని ఘనంగా నిర్వహించారు. ఇటలీకి చెందిన ప్రొఫెసర్ మైఖెల్‌గాలో, డైరెక్టర్ డాక్టర్ బి.సరోజమ్మ, విశ్రాంత అధ్యాపకులు దత్తాత్రేయరావు, బాలసిద్ధముని, పాండిచ్చేరి వర్సిటీ డీన్ పి.తిరుపతిరావు, వెంకటరమణారెడ్డి, కె.మురళి, హిరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమష్టిగా ఎన్నికల విధులు

తిరుపతి అర్బన్: కలెక్టర్‌తోపాటు ఎస్పీ సమష్టిగా ఎన్నికల విధులు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. విజయవాడ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించగా. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జీ.లక్ష్మీశ తోపాటు ఎస్పీ మలికా గార్గ్, జేసీ శుభం భన్సల్, అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఆర్వో పెంచల కిషోర్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహన సేవలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులు, సూర్యప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న అనుగ్రహం





దివ్యతేజం.. భక్తజన పునీతం

తుమ్మలగుంటలో వైభవంగా రథసప్తమి వేడుకలు

- సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడి దివ్యదర్శనం
- సప్త వాహనాలపై కల్యాణ వెంకన్న చిద్విలాసం
- ఒక్కరోజు బ్రహ్మోత్సవంతో పరవశించిన భక్తజనం

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ ఆ శ్రీమన్నారాయణుడు భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం సూర్య జయంతిని పురస్కరించుకొని 'రథసప్తమి' ఉత్సవాన్ని ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఒకే రోజున కల్యాణ వెంకన్న సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై అనుగ్రహించడం విశేషం. రథసప్తమి పర్వదినాన సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సప్త (ఏడు) వాహనాలపై స్వామి వారిని ఊరేగించారు. శ్రీవారి ఆలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి రథసప్తమి వేడుకల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవం.. సూర్యప్రభ వాహనం

రథసప్తమి వాహనసేవల్లో అత్యంత ప్రధానమైనది సూర్యప్రభ వాహనం. శ్రీకల్యాణ వెంకన్న ఆలయం వద్దనున్న అలంకార మండపం ముందు శ్రీమలయప్ప స్వామివారిని సూర్యప్రభ వాహనంపై వేంచేపు చేశారు. అనంతరం ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకుని రాగా సర్వలోకాలకు చైతన్యం కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.55 గంటలకు శ్రీవారి పాదాలపై ప్రసరించి అంజలి ఘటించారు.



గరుడ వాహనంపై మలయప్పస్వామి

ఆయురారోగ్యప్రాప్తి

సకల రోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత సూర్యుడు. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తారు.



వాహన సేవలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నస్వామి

మేమొస్తే ఆ ఇళ్లన్నీ పడగొట్టేస్తాం!

- నిరుపేదల ఇళ్లపై బొజ్జల కక్ష
- జై జగన్ అంటూ ప్రసంగాన్ని ముగించిన టీడీపీ నేత సుధీర్

సాక్షి, తిరుపతి: 'టీడీపీ ప్రభుత్వం వస్తే పేదలు నిర్మించుకున్న నివాసాలన్నింటినీ కూలదొసేస్తాం' అని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. శ్రీకాళహస్తి పరిధిలోని రేణిగుంట మండలం, కరకంబాడిలో శుక్రవారం సుధీర్‌రెడ్డి పర్యటించారు. టీడీపీ కార్యకర్తలకే మళ్లీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించుకున్నారు. వారంతా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలేనని ప్రచారం చేయించుకున్నారు. సుధారాణి, తులసి, జయంతి, నవీంద్ర మరికొందరికి బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పారు. వీరంతా మొదటి నుంచి టీడీపీ కార్యకర్తలే. వారు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారని, దాని కోసమే కరకంబాడిలో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇస్తున్న విషయం తెలిసిందే. ఆ జాబితాలో లేని అర్హులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు ఇప్పించారు. సొంత ఇల్లులేని వారందరికీ ప్రభుత్వం తరుపున స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేపడుతున్న వాటిని అక్రమం అంటూ, తాము అధికారంలోకి వస్తే వాటన్నింటినీ పడగొట్టేస్తాం అంటూ హెచ్చరించడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 14 ఏళ్లు పాలించిన టీడీపీ ప్రభుత్వంలో సెంటు స్థలానికి నోచుకోలేక పోయామని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇస్తుంటే ఓర్వలేని బొజ్జల సుధీర్ రెడ్డి లాంటి వారు ఇలాంటి ప్రకటనలు చేయడం భావ్యం కాదని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

జై జగన్

కరకంబాడిలో నిర్వహించిన కార్యక్రమంలో బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రసంగిస్తూ.. చివరగా ఒకమాట చెప్పదలుచుకున్నానంటూ రెండు మాటలు మాట్లాడి 'జై జగన్' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. గతంలోనూ పలు కార్యక్రమాల్లో బొజ్జల సుధీర్‌రెడ్డి తన ప్రసంగం అంతా అయ్యాక 'జై జగన్' అని ముగించడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల నియామకం

తిరుపతి మంగళం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పలు విభాగాల కమిటీ సభ్యులను నియమించారు. రాష్ట్ర ఎస్టీ విభాగం కార్యదర్శిగా ఉయ్యాల శ్యామలాదేవి, రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే.యజ్ఞానిబాషాను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే తిరుపతి జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి రావి దేవికచౌదరి స్థానంలో కాటూరు రామతులసిని నియమిరచారు.

తిరుపతి నగర కమిటీ నియామకం

వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షులుగా పాలగిరి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మధుసూదన్‌నాయుడు, పాముల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా డీ.మునిశేఖర్‌రెడ్డి, జే.మణి, కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, దుంప రాజారెడ్డి, జీవరత్నం, దాసునాయుడు, కార్యదర్శులుగా బాబ్జి, జగదీష్‌యాదవ్, పురుషోత్తం, మురళి, మల్లికార్జునరెడ్డి, ప్రకాష్, చిరంజీవిరెడ్డి, కన్నయ్య, రవీంద్రరెడ్డి, ఇ.వెంకటేష్, మొగరాల శివ, ముకుంద, సంయుక్త కార్యదర్శులుగా గాయనాత్, కుమార్, కైలాష్, శ్రీనివాసులురెడ్డి, ప్రకాష్ మార్వాడి, వీ.రావ్, ఓం.మొదిలియార్, భాస్కర్‌రాయల్, రమేష్‌యాదవ్, మునికృష్ణారెడ్డి, సలీమ్, శాంతారెడ్డి, మైనారిటీ సెల్ స్టేట్ సెక్రటరీగా ఎస్‌కే యాజ్‌దాని బాషా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

తిరుపతి డాక్టర్స్ కమిటీ విభాగం..

వైఎస్సార్‌సీపీ తిరుపతి డాక్టర్ల కమిటీ విభాగం అధ్యక్షులుగా డాక్టర్ డీ.నరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ చందన, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ భాస్కర్‌రావ్, డాక్టర్ జీవన్‌కుమార్, డాక్టర్ ఎస్.గణేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ బీ.చైతన్య, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ బీ.జనార్ధన్‌రాజు, డాక్టర్ బీ.శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ బీ.రాజేష్‌కుమార్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ వీ.శాంతి, డాక్టర్ లలిత, సమ్యుక్త కార్యదర్శులుగా డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ ఓ.రమేష్, డాక్టర్ ముంతాజ్, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కే.వాణి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ నాగిరెడ్డి, డాక్టర్ విజయుడు, డాక్టర్ బాపతి, డాక్టర్ కే.వెంకటమునిరెడ్డి, కేసీ.బాషా, ఎస్.షరూపుద్దీన్, డాక్టర్ ఎంఎల్.వెంకటేస్‌కుమార్, డాక్టర్ మహేష్, డాక్టర్ ఎస్.రోషిణి నియమితులయ్యారు.

నిబద్ధతతో ఎన్నికల విధులు

వెంకటగిరి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బెటాలియన్ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఏపీ ఎస్పీ బెటాలియన్స్ డీఐజీ-4 రాజకుమారి సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా 9వ బెటాలియన్‌కు విచ్చేసిన ఆమెకు పరేడ్ గ్రౌండ్‌లో సెరిమోనియల్ పరేడ్ గౌరవం నిర్వహించారు. కంపెనీడ్రిల్స్, వెపన్‌క్లాసెస్, మాబ్ ఆపరేషన్, ఎస్‌డీఆర్ ఎఫ్ పరికరాలను పరిశీలించారు. మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, ఆయుధశాల, స్టోర్స్, క్యాంటీన్, వైద్యశాల, పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం 9వబెటాలియన్ కమాండెంట్ పీ.ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బెటాలియన్ సిబ్బందికి కేటాయించిన విధుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బాధ్యతతా పని చేయాలన్నారు. అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోష్, అసిస్టెంట్ కమాండెంట్ మనోహర్, అనంద్‌కన్నా, రామకృష్ణ, ఏఓ చంద్రమౌళి, వైద్యులు శేషమ్మ, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.



9వ బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ రాజకుమారి

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



విజయోత్సవ సంబరాల్లో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడియేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఈ కళాశాలలో 8 బ్రాంచ్‌లు ఉండగా అందులో 5 బ్రాంచ్‌లు ఉండగా.. అందులో ఈసీఈ, బయోమెడికల్, కంప్యూటర్, ఈఈఈ, మెకానికల్ బ్రాంచ్‌లకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపుతో కళాశాలకు మంజూరయ్యే అదనపు నిధులతో ల్యాబ్‌లు, వర్క్‌షాపులు, క్రీడా రంగం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.

వడ్డీ చెల్లించే అంశంపై వివాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి



గాయపడిన వరుణ్



పోలీసుల అదుపులో విజయ్

శ్రీకాళహస్తి: అప్పు తిరిగి చెల్లించే సమయంలో వడ్డీ అంశంపై ఇరువురి మధ్య చెలరేగిన వివాదంలో ఓ మహిళతోపాటు ఆమె కుమారుడు గాయపడిన సంఘటన తొట్టంబేడు మండలం, తాటిపర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. తొట్టంబేడు పోలీసుల కథనం.. తాటిపర్తి గ్రామానికి చెందిన జ్యోతి(54), కుమారుడు వరుణ్(28) శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కైలాస నగర్‌లో నివసిస్తున్నారు. వరుణ్‌కు తిరుపతికి చెందిన విజయ్ అనే వ్యక్తితో స్నేహం కొనసాగుతోంది. ఏడాది కిందట విజయ్(30)కి డబ్బు అవసరం రావడంతో వరుణ్ తన తల్లి జ్యోతి వద్ద రూ.20 లక్షలు అప్పుగా తీసి తన స్నేహితునికి ఇచ్చాడు. ఆ సమయంలో విజయ్ నుంచి ఆస్తులను జ్యోతి తండ్రి క్రిష్ణమనాయుడుకు తనఖా పెడుతున్నట్లు అగ్రిమెంటు రాయించుకున్నారు. ఆపై విజయ్ అప్పు చెల్లించేస్తానని చెప్పడంతో.. అసలు రూ.20 లక్షలు, అందుకు వడ్డీ రూ.81 వేలుగా లెక్కలు తేల్చారు. విజయ్ అసలు రూ.20 లక్షలు చెల్లిస్తానని, వడ్డీ చెల్లించలేనని చెప్పాడు. తన ఆస్తులకు సంబంధించిన పత్రాలను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశాడు. అప్పుకు సంబంధించిప వడ్డీ చెల్లించనిదే పత్రాలు ఇచ్చేదిలేదని వరుణ్ గట్టిగా చెప్పడంతో వారి మధ్య వివాదం నెలకొంది. ఆపై విజయ్ ముందుగా తెచ్చుకున్న చాకును తీసి వరుణ్ మెడ వద్దపెట్టి తన పత్రాలు అందించాలంటూ బెదిరించాడు. ఆందోళనకు గురైన జ్యోతి విజయ్‌ను వెనక్కిలాగింది. ఆగ్రహించిన విజయ్ అక్కడే ఉన్న చిన్నపాటి పారతో జ్యోతి తలపై మోదాడు. దీంతో ఆమె తలకు గాయంకాగా వరుణ్‌కు ఛాతి వద్ద గాయమైంది. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు విజయ్‌ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గొల్లపల్లి సిద్ధార్థ కళాశాలలో క్యాంపస్ సెలెక్షన్స్



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల చైర్మన్ కొండారెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ ఆల్‌సెక్ టెక్నాలజీస్ సంస్థ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ఆఫర్ లెటర్స్‌ను ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఒకేసారి 35 మంది విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలలో చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి శిక్షణ కాలంలో రూ.2.26 వార్షిక వేతనం ఉంటుందని, శిక్షణ పూర్తయిన తర్వాత రూ.6 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఇస్తారని తెలిపారు. రికార్డు స్థాయిలో క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపిక కావడంలో కృషి చేసిన ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథ్, టీపీఓ భాస్కర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ వారిని చూపిస్తున్న సెబ్ అధికారులు

గూడూరు రూరల్: చిల్లకూరు మండలం, బూదనం టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో శుక్రవారం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా.. 10 కిలోల గంజాయి బయటపడినట్టు సెబ్ సీఐ రమేష్ తెలిపారు. అనంతరం గంజాయిని స్వాధీనం చేసుకుని ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. వివరాలు.. చెన్నైకి చెందిన సంజయ్‌కుమార్, ఆకాష్ ఆంధ్రలోని అనకాపల్లిలో కిలో గంజాయి రూ.4 వేల చొప్పున కొనుగోలు చేసి చెన్నైకి తరలించేందుకు సిద్ధమయ్యారు. బస్సు కోసం వేచి ఉండగా అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేయగా అసలు విషయం బయటపడింది. దీంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్ఐ మోజెస్, కిరణ్‌సింగ్, రమేష్, ప్రసాద్, కృష్ణయ్య, గౌస్‌బాషా, ఆనందబాబు, రామ్‌ప్రసాద్ పాల్గొన్నట్టు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కోట: విద్యానగర్ సమీపంలోని పంటపొలాల్లో ఉన్న నేలబావిలో దూకి మహిళ మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నాగబాబు కథనం.. లక్ష్మక్కకండ్రిగకు చెందిన సూళ్లూరు శైలజ(30) నేలబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో భర్త మహేష్‌తో గొడవపడిన ఆమె మనస్తాపానికి గురై అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం మృతురాలి తల్లి ఈశ్వరమ్మ తన కుమార్తెను ఆమె భర్త కొట్టిచంపి బావిలో పడేశాడని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడిపిన కేసులో ఐదుగురు నిందితులకు రూ.50 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, స్థానిక నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

ఐఐటీ జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ



సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు, విద్యార్థులతో డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: ఐఐటీ తిరుపతి జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ అని డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో కెమిస్ట్రీ విభాగం ఆధునిక ట్రెండ్స్ ఇన్ కెమికల్ సైన్సెస్ అనే అంశంపై రెండు రోజుల సదస్సు జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌లో వివిధ రసాయనికశాస్త్ర రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు హాజరయ్యారు. డైరెక్టర్ మాట్లాడుతూ అంతరిక్షం ద్వారా జరిగే యాత్ర, సెల్ మెంబ్రేన్ ట్రాన్స్‌పోర్ట్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో బెంగళూరు ఐఐఎస్సీ నేషనల్ సైన్స్ చైర్ ప్రొఫెసర్ బిమన్‌బాగ్చి, బెంగళూరు ఐఐఎస్సీ ఇన్ఫోసిస్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ ముగేష్, ఐఐటీ తిరుపతి విభాగాధిపతి ప్రొఫెసర్ గౌరీ ప్రసన్నరాయ్ పాల్గొన్నారు.

శరవేగంగా భూ రీ సర్వే

తిరుపతి అర్బన్: భూ రీ సర్వే వేగవంతంగా జరగుతోందని సర్వే విభాగం జిల్లా అధికారి జయరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి అయిన భూములను కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే ఆటోమేటిక్ మ్యూటేషన్ అవుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో 1051 గ్రామాల్లో 15,40,351 ఎకరాల్లో భూసర్వే చేపట్టాల్సి ఉందని చెప్పారు. తొలి దశలో 74 గ్రామాల్లో 11,972 ఎకరాలు, రెండో దశలో 106 గ్రామాల్లో 27,998 ఎకరాల సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఆమేరకు 15,552 మందికి భూహక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు వివరించారు. మొదటి రెండు విడతల్లో సర్వే పూర్తయిన భూముల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు పూర్తి చేశామన్నారు. మూడో విడతలో 140 గ్రామాల్లో 1,31,401 ఎకరాల్లో జోరుగా సర్వే సాగుతుందని చెప్పారు.



జయరాజ్, సర్వే విభాగం జిల్లా అధికారి